# చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

శుక్రవారం
హైదరాబాద్
04.04.2025

సంపుటి : 15 సంచిక: 205
పేజీలు: 8 వెల: రూ.5

@ChattamTV




## మేడ్చల్, నాగర్ కర్నూల్ కలెక్టరేట్లకు బాంబ్ బెదిరింపు

చట్టం, మేడ్చల్/నాగర్ కర్నూల్: మేడ్చల్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టరేట్లకు బాంబు బెదిరింపు మెసేజ్ లు కలకలం రేపాయి. గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. కలెక్టరేట్‌లో బాంబు పెట్టినట్లు ఏవోకు మెయిల్ ద్వారా దుండగులు బెదిరించారు. అలర్ట్ అయిన అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కలెక్టరేట్‌కు చేరుకున్న పోలీసులు, డాగ్‌స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపట్టారు. అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. మరోవైపు నాగర్ కర్నూల్ కలెక్టరేట్ కు గురువారం మధ్యాహ్నం వచ్చిన బాంబు బెదిరింపు మెసేజ్ కలకలం రేపింది. మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్ ను బాంబులతో పేలుస్తామంటూ మెసేజ్ లో ఉండడంతో అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ బుర్రి శ్రీనివాసులు, సీఐ కనకయ్య బాంబు స్క్వాడ్ టీమ్ తో కలెక్టరేట్ కు చేరుకుని పరిసరాలను తనిఖీ చేశారు. ఫేక్ మెసేజ్ గా తేల్చారు. ఈ రెండు ఘటనలపై ఆయా జిల్లాల పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

## పలుప్రాంతాల్లో భారీ వర్షం.. రోడ్లపై నిలిచిన నీరు.. పొంగిపొర్లిన నాలాలు

- ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందిపడ్డ వాహనదారులు
- ఖైరతాబాద్ లో కారుపై కూలిన చెట్టు
- సెక్రటేరియట్ ముందు చెరువును తలపించిన రోడ్లు
- పాతబస్తీలోనూ కూలిన చెట్లు.. కాలనీల్లో మోకాలి లోతు నీరు
- చార్మినార్ వద్ద ఓ మినార్ నుంచి ఊడి పడ్డ పెచ్చులు
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వానలు.. ఆరెంజ్ అలర్ట్ జారీ
- నాగర్ కర్నూల్ జిల్లాలో విషాదం.. పిడుగుపడి ఇద్దరు మృతి
- మరో నాలుగు రోజులు వర్షాలు: హైదరాబాద్ వాతావరణ శాఖ



**చట్టం, హైదరాబాద్/నెట్ వర్క్:**

హైదరాబాద్ సిటీలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం దంచి కొట్టింది. సిటీ వెదర్ ఒక్కసారిగా చల్లబడటంతో ఎండలకు అల్లాడుతున్న జనాలకు రిలీఫ్ దక్కింది. సిటీలోని పలు ప్రాంతాల్లో వాన పడింది. హిమాయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, ఎల్ బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, విద్యానగర్, కోఠి, అబిడ్స్, సికింద్రాబాద్, చిలకలగూడ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్‌లోని మెర్క్యురీ హోటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. సెక్రటేరియట్ ముందుభాగం చెరువును తలపించింది. చార్మినార్‌లోని ఓ మినార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం జరగలేదు. వివిధ చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మలక్‌పేట బ్రిడ్జి వద్ద వరదనీరు నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. చిలకలగూడ రైల్వే బ్రిడ్జి కింద మోకాలిలోతు నీరు నిలిచిపోగా.. ట్రాఫిక్ సిబ్బంది వాటిని క్లియర్ చేశారు.

**పొలం పనులు చేస్తుండగా పిడుగుపడి.**

పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా మండల కేంద్రం సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కోడోనిపల్లికి చెందిన కొందరు మహిళలు గురువారం వ్యవసాయ పనుల కోసం కూలికి వెళ్లారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగు పడింది. సంఘటనలో కోడోనిపల్లెకు చెందిన సుంకరి సైదమ్మ (40), గాజుల వీరమ్మ (60), అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను పదర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

**ఈ జిల్లాల్లో భారీ వానలు..**

రాష్ట్రంలో మరో నాలుగురోజుల పాటు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆయా జిల్లాల్లో వడగండ్ల వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తీర్పు రిజర్వ్

- సుప్రీం కోర్టులో ముగిసిన విచారణ
- రీజనబుల్ టైమ్ ఏంటో చెప్పాలని మరోసారి న్యాయస్థానం క్వశ్చన్
- ఆరు నెలల సమయం కావాలన్న స్పీకర్ న్యాయవాది
- ఇప్పటికే 14 నెలల టైమ్ వృథా అయ్యిందంటూ కోర్టు అసహనం
- అసెంబ్లీలో రేవంత్ మాటలను ప్రస్తావించిన బీఆర్ఎస్ తరఫు అడ్వొకేట్
- సీఎం స్వీయ నియంత్రణ పాటించలేరా? అంటూ ధర్మాసనం ఆగ్రహం
- రేవంత్ మాటలు కోర్టు ధిక్కారం కింద తీసుకుంటామంటూ వార్నింగ్
- 8 వారాల్లోగా తీర్పు వెల్లడించే అవకాశం

**చట్టం, ఢిల్లీ:**



బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో విచారణ ముగిసింది. అన్నివైపులా వాదనలు పూర్తి కావడంతో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే.. 8 వారాల్లోగా తీర్పు వెల్లడించాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది ఆర్యమా సుందరం విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ గురువారం వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వీ బెంచ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రీజనబుల్ టైం ఏంటో చెప్పాలని స్పీకర్‌ను కోరుతూ.. మరోసారి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. . అనర్హత పిటిషన్లపై విచారణకు మీకు ఎంత సమయం కావాలి? అని ప్రశ్నించగా.. ఒక్క మాటలో చెప్పాలంటే ఆరు నెలల సమయం కావాలి అని న్యాయవాది సింఘ్వీ అన్నారు. దీంతో జస్టిస్ గవాయ్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే 14 నెలల సమయం వృథా అయ్యింది. మరో ఆరు నెలలు ఎలా అడుగుతారు?. ఇన్ని నెలలు గడిచాక కూడా కోర్టులు జోక్యం చేసుకోవాల్సిన సమయం రాలేదా? అని ప్రశ్నించారు. అయితే..

**సీఎం ఇలా వ్యవహరిస్తే ఎలా..?**

స్పీకర్‌కు తుపాకీ గురిపెట్టి నిర్ణయం తీసుకోమని ఒత్తిడి చేస్తున్నారని లాయర్ సింఘ్వీ అన్నారు. ఈ క్రమంలో.. బీఆర్ఎస్ తరఫు న్యాయవాది ఆర్యమా సుందరం కలుగజేసుకుని సీఎం రేవంత్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. ''ఉప ఎన్నికలు రావు.. స్పీకర్ తరఫున కూడా చెబుతున్నా'' అంటూ ఆయన వ్యాఖ్యానించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని అన్నారని చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ 'సీఎం కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా? గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా?'' అని ప్రశ్నించారు.

## మాకు నీళ్లు ఇవ్వకపోతే.. హైదరాబాద్ కు పంపే నీటిని అడ్డుకుంటాం

- కాంగ్రెస్ సర్కారుకు రైతులు గోస కనిపించట్లేదా?
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం

**చట్టం, దుబ్బాక:**

బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్ట్ లు, కాల్వలు నిర్మిస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు కనీసం సబ్ కెనాల్స్ ను కూడా నిర్మించట్లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. ఏడాది కాలంగా కాల్వలు నిర్మించి నీళ్లు అందించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు మూలంగా దుబ్బాక సెగ్మెంట్ లోని రైతులు సర్వం కోల్పోయారని, మా కడుపు నింపిన తర్వాతే బయటకు నీళ్లు తీసుకెళ్లాలన్నారు. లేకపోతే మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ కు గోదావరి జలాలు వెళ్లకుండా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. గురువారం దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లిలో అధికారులు, రైతులతో కలిసి సాగునీటి వ్యవస్థను ఆయన పరిశీలించారు. బుల్లెట్ బైక్ పై తిరుగుతూ కుంటలు, కాల్వలు, చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మల్లన్న సాగర్ నిర్మాణం వల్ల తాము గ్రామాలు కోల్పోవడంతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. మా దగ్గర వెంటనే కాలువలు పూర్తి చేసి దుబ్బాక నియోజకవర్గ రైతులకు నీళ్లివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆ భూములు ఎవరూ కొనవద్దు

- కొంటే మేం అధికారంలోకి వచ్చాక వెనక్కి తీసుకుంటాం
- 400 ఎకరాల్లో అతిపెద్ద ఎకో పార్క్‌ని ఏర్పాటు చేస్తాం
- హైదరాబాద్ భవిష్యత్తు కోసం విద్యార్థులు కొట్లాడుతున్నారు
- విద్యార్థుల పోరాటానికి అండగా ఉంటాం
- హెచ్‌సీయూ అంశంపై రాహుల్ ఎందుకు స్పందిస్తలేడు.?
- రేవంత్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నాడు
- కంచె గచ్చిబౌలి భూముల వివాదంపై కేటీఆర్

**చట్టం, హైదరాబాద్ :**



పొరపాటున కూడా కంచ గచ్చిబౌలి భూములను ఎవరూ కొనుగోలు చేయొద్దని.. ఒకవేళ కొంటే మూడేళ్ల తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఆ భూములను వెనక్కి తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. 400 ఎకరాల్లో అతి పెద్ద ఎకో పార్క్‌ని ఏర్పాటు చేసి హైదరాబాద్ ప్రజలు, హెచ్‌సీయూ విద్యార్థులకు కానుకగా ఇస్తామన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ తరఫున ఓ మాట ఇస్తున్నాం. మూడేళ్లలో ప్రభుత్వంలోకి వస్తున్నాం. ప్రభుత్వంలోకి వచ్చాక ఆ 400 ఎకరాలను రాష్ట్రంలోనే అతిపెద్ద ఎకో పార్క్‌గా ఏర్పాటు చేస్తాం. ఎవరైనా రేవంత్‌రెడ్డి విసిరే బిస్కెట్లకు ఆశపడి.. రేవంత్‌రెడ్డి చెప్పే మాటలకు ఆశపడి ఆ ల్యాండ్‌లో ఒక ఇంచు కొనుగోలు చేసినా తిరిగి వెనక్కి తీసుకుంటాం' అని కేటీఆర్ అన్నారు.

**భవిష్యత్తు కోసం కొట్లాట**

రాష్ట్రంలో పేరుకే ప్రజాపాలన..ఎక్కడా ప్రజాస్వామ్య స్ఫూర్తి కనిపించడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసం విద్యార్థులు కొట్లాడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ విస్తరణ కాంక్షతో పని చేస్తుంటే.. తాము మాత్రం భవిష్యత్ తరాల కోసం ఆలోచిస్తున్నామన్నారు. ఇంత జరుగుతున్నా రాహుల్ గాంధీ ఎక్కడున్నారు? అని ప్రశ్నించారు. 'ఫ్యూచర్ సిటీ కోసం 14 వేల ఎకరాల భూమి ఉండగా.. హెచ్‌సీయూలో ఉన్న ఆ 400 ఎకరాలే ఎందుకు?.. .ఆ 400 ఎకరాల భూముల్లో మూగజీవాలు కనిపించడం లేదా? అని కేటీఆర్ నిలదీశారు. ఆ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ జరగాలన్న ఆయన.. ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మారొద్దన్నారు.

**కాంగ్రెస్ విధానమేంటీ..?**

యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలు పట్టించుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ భూములను కాపాడి హైదరాబాద్ కు మణిహారంగా ఉండేలా ఏకోపార్క్ అభివృద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని.. మరి కాంగ్రెస్ విధానం ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో కోట్ల మొక్కలు నాటి హరిత విప్లవానికి తెరలేపామని హైదరాబాద్ కు గ్రీన్ సిటీ అవార్డు వచ్చిందన్నారు. ఈ ప్రభుత్వానికి కోర్టులంటే గౌరవం లేదని కోర్టులు చెప్పినా వినకుండా అర్ధరాత్రులు చెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. ఇవి నిజంగా ప్రభుత్వ భూములే అయితే దొడ్డిదారిలో ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. మంత్రులు తెలిసి తెలియక మాట్లాడుతున్నారని.. సీఎం మెప్పుకోసం మాట్లాడేవారితో తమకెలాంటి ఫికర్ లేదన్నారు.



## అన్నీ పనులు వెంటనే ఆపండి

- కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతపై సుప్రీం సీరియస్
- చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ఆగ్రహం
- ఇది చాలా తీవ్రమైన అంశమన్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం
- తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని ఆదేశం
- ఈనెల 16కు తదుపరి విచారణ వాయిదా.. సుప్రీం తీర్పుపై విద్యార్థులు, విపక్ష నేతల హర్షం
- హెచ్‌సీయూలో సంబరాలు చేసుకున్న స్టూడెంట్స్
- విద్యార్థులకు అండగా ఉంటామన్న రఘునందన్ రావు
- సుప్రీం తీర్పు రేవంత్‌కు చెంపపెట్టు లాంటిదన్న హరీశ్ రావు

**చట్టం, హైదరాబాద్ :**

హెచ్‌సీయూ సమీపంలోని కంచ గచ్చిబౌలి భూముల్లో జరుగుతున్న అన్ని పనులను తక్షణమే ఆపేయాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలిలోని భూముల వ్యవహారంలో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు చర్యలు నిలిపివేయాలని స్పష్టం చేసింది. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ మధ్యంతర నివేదికను పంపారు. హైకోర్టు నివేదికను పరిశీలించిన జస్టిస్ గవాయ్ ధర్మాసనం.. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని పేర్కొంది. ఈ వ్యవహారానికి సంబంధించి వార్తా కథనాలను అమికస్ క్యూరీ.. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు మెన్షన్ చేసింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని అత్యున్నత న్యాయస్థానం ప్రతివాదిగా చేర్చింది. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా చెట్లు కొట్టే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా అని నిలదీసింది. ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని వ్యాఖ్యానించింది. తమ ప్రశ్నలకు సీఎస్ సమాధానం చెప్పాలని సుప్రీం ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు.. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

**హెచ్‌సీయూలో సంబరాలు**

కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. సుప్రీం కోర్టు తీర్పుతోనైనా రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలు విరమించుకోవాలని విద్యార్థులు సూచించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

**విద్యార్థులకు అండగా ఉంటాం : రఘునందన్ రావు**

హెచ్‌సీయూ భూముల విషయంలో విద్యార్థులకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు. ''యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలి. అనుమతి లేకుండా చెట్లు కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది.

## కేటీఆర్ పగటి కలలు కంటున్నడు

- కేటీఆర్ వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కౌంటర్
- ఇద్దరు బీసీలకు అవకాశమివ్వాలని హైకమాండ్‌ను కోరినట్లు వెల్లడి

**చట్టం, ఢిల్లీ :**

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగలు కంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాబోయే రాజకీయ ముఖ చిత్రంలో బీఆర్ఎస్ ఉండదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బంగారం లాంటి భూములను దోచుకున్న ఘనత బీఆర్ఎస్‌దని ఆరోపించారు. గురువారం ఢిల్లీలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు ఐఎంజీ భారత్‌కు భూములను అప్పనంగా కట్టబెడితే.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆ కేటాయింపులను రద్దుచేసి ప్రభుత్వ భూములను కాపాడారని చెప్పారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపైన విచారణ జరగాలన్నారు. లక్షల కోట్ల అప్పుల్లో ముంచి తెలంగాణను నాశనం చేసిన వ్యక్తి కేటీఆర్ అని..మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఫైర్ అయ్యారు.

**మైనార్టీకి ఛాన్స్..**

మంత్రివర్గ విస్తరణ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అవి తొలగిపోయి అతి త్వరలోనే కేబినెట్ విస్తరణకు ఏఐసీసీ తేదీని ప్రకటిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.



CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# బాసర త్రిబుల్ ఐటీ లో న్యాక్ సన్నాహక సమావేశం

▶ దిశా నిర్దేశం చేసిన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



**చట్టం, బాసర :** రాజీవ్ గాంధీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విశ్వవిద్యాలయం బాసర త్రిబుల్ ఐటీలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్ ఏ ఏ సి) మూల్యాంకనానికి సంబంధించిన సన్నాహక సమావేశం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి OSD, AO, అసోసియేట్ డీన్లు, అధ్యాపక వర్గ సభ్యులు హాజరై, ఎన్ ఏ ఏ సి సమీక్ష కోసం అవసరమైన ఏర్పాట్లు, ప్రణాళికలను చర్చించి ఖరారు చేశారు. ప్రొఫెసర్ గోవర్ధన్ న్యాక్ అక్రిడిటేషన్ ప్రక్రియను నిర్ధారించడానికి అధ్యాపకులను వివరాలతో సంసిద్ధులు కావాలని సూచించారు. యూనివర్శిటీ అకడమిక్, పరిపాలనా, మౌలిక సదుపాయాల ప్రమాణాలను మెరుగుపరచేందుకు అధ్యాపకులకు అవసరమైన సూచనలు అందించారు. ఎన్ ఏ ఏ సి అక్రిడిటేషన్ విద్యాసంస్థలకు నాణ్యత ప్రమాణాలను పెంపొందించేందుకు, విద్యా వ్యవస్థలో ఉత్తమ మార్గదర్శకాలను స్థాపించేందుకు ఒక ముఖ్యమైన అంశంగా మారింది. ఆర్జీయూకేటి విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు కట్టుబడి ఈ ఎన్ ఏ ఏ సి మూల్యాంకన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటోంది తెలిపారు. ఆర్జీయూకేటీ నాణ్యమైన విద్యను అందించడంలో అంకితభావంతో ఉంది. పరిశోధన, కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థులకు ఒక మెరుగైన భవిష్యత్తును అందించడానికి కృషి చేస్తోందని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి పలు నూతన కోర్సులను ఏర్పాటు చేయడానికి ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో ముందుంచేందుకు కృషి చేస్తున్నామని అందులో అధ్యాపకుల పాత్ర ఎనలేనిదని అంశాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో ఓఎస్డి ప్రొఫెసర్ మురళీధర్షన్ ఏవో రణధీర్ అసోసియేటెడ్ డాక్టర్ విటల్, డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్, హెచ్ఓడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# బాసర ఆలయానికి రిఫ్రిజిరేటర్ అందజేత



**చట్టం, బాసర :** చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి హైదరాబాద్ కు చెందిన డాక్టర్ జానకి రామ్ రెడ్డి తన మొక్కుబడిగా అమ్మవారికి రిఫ్రిజిరేటర్ ను విరాళంగా అందజేశారు. దేవస్థానం సూపర్డెంట్ శివరాజ్ చేతుల మీదుగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. విరాళం ఇచ్చిన డాక్టర్ రామ్ రెడ్డి కుటుంబ సభ్యుల గోత్ర నామాలతో వేద మంత్రోచ్చరణాల మధ్య ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్,ముఖ్య అర్చకులు. మదన్ దీక్షిత్, వేదపండితులు నవీన్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతలకు ప్రత్యేక కుంకుమార్చన పూజలు చేపట్టి వేదమంత్రాలు మధ్య వేద పండితులు ఆశీర్వచనం అందించి అమ్మవారి లడ్డు తీర్థ ప్రసాదాలు బహూకరించి శేష వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ సూపర్డెంట్ శివరాజ్ మాట్లాడుతూ.. భక్తులు అమ్మవారి కృపా కటాక్షాల వల్ల వస్తు రూపేనా ధన రూపేనా దేవస్థానం కు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతంలో రిఫ్రిజిరేటర్ లేక కొంత ఇబ్బందిగా ఉండేది దీనిలో అమ్మవారి అలంకరణ అభిషేకలకు పాలు పువ్వులు తదితర వస్తువులను భద్రపరచడం జరుగుతుందని మంచి ఆలోచనతో దాత రిఫ్రిజిరేటర్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని వారికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని ఆలయ అధికారులు వైదిక బృందం ప్రత్యేక ఆశీర్వచనం అందించారు.

# నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ



**చట్టం ఇందల్వాయి :** ఇందల్వాయి మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీకీ భూమి పూజ నిర్వహించిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి. తాండలు గ్రామ పంచాయతీలుగా ఏర్పడి నుంచి అదే భవనంలో విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సొంత భవనాన్ని కట్టుకోవడానికి మన ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భవనాలు నిర్మించుకోవడానికి ప్రభుత్వ భూములలో భూమి పూజ నిర్వహించడమైనది. అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు అధికారులు పాల్గొన్నారు.

# ఫోక్సో కేసు బాధితులకు ఆర్థికంగా ఆదుకుంటాం

▶ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల వెల్లడి




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో గతంలో ఫోక్సో కేసు బాధితులు, అత్యాచారానికి గురైన బాధితులకు తక్షణ సహాయం అందించడానికి మేమున్నాం అని భరోసా కల్పిస్తూ అట్టి బాధిత మహిళలకు , పిల్లలకు ఈ నెల 28 న జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా ఎస్ పి జానకి షర్మిల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితులకు భరోసా సెంటర్ అండగా ఉంటుందని వేదింపులు, అత్యాచారం, బాధిత మహిళలకు, పిల్లలకు ఒకే చోట మెడికల్, న్యాయసలహా, వైద్యం, కౌన్సిలింగ్, సైకాలజికల్ సమస్యలను ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పిస్తూ రాష్ట్ర పోలీసు, ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగినది అని అన్నారు. మహిళల భద్రతకు భరోసనిస్తూ, బాధిత మహిళలను, పిల్లలను హక్కున చేర్చుకొని, కొండంత ధైర్యాన్నిస్తూ, మహిళలు, పిల్లల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా సెంటర్ సేవలు అందిస్తుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

▶ ఆలయ అభివృద్ధికి కొరకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం



**చట్టం, నేరడిగొండ :** మండలంలోని శంక్రపూర్ గ్రామంలో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన ,శిఖర పూజ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్. ఆలయంలో (శ్రీశ్రీలింబామహారాజ్) సురేష్ మహారాజ్ లతో కలిసి ప్రత్యేక పూజలుచేశారు. ఆడే గజేందర్ కి గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి (షెడ్) నిర్మాణం కోసం రూ.5 లక్షల రూపాయలతో మరియు నీటి సౌకర్యం కోసం బోర్ వేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు ఉన్నారు.

# బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరణ



**చట్టం గంగారాం:** ఎస్టీ లలో వర్గీకరణ కోసం ఈ నెల 17 న ఇల్లందులో జరిగే బహిరంగ సభ కు కరపత్రం ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ రామనాల లక్ష్మయ్య, ప్రతి బుర్క యాదగిరి, vattam కన్నయ్య, suvarnapaka వెంకట రత్నం, పెనుక వెంకన్న, కల్తీ రమేష్ తదితరులు పాల్గొన్నారు

# రాజ్యాంగ పరిరక్షనే కాంగ్రెస్ లక్ష్యం

▶ జై భీమ్ జై బాపు జై సంవిధన్ అనే నినాదంతో గ్రామాల్లో పాదయాత్ర
▶ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ అమితాషా అంబేద్కర్ పై, భారత రాజ్యాంగాన్ని అవమానపరిచేలా మాట్లాడడాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షనే ధ్యేయంగా గురువారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ల ఆదేశాల మేరకు చిన్నకోడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో చిన్నకోడూరు మండల పరిధిలోనీ అనంతసాగర్, చెర్లంకిరెడ్డిపల్లి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోర్డినేటర్లుగా సిద్దిపేట కౌన్సిలర్ సాకి ఆనంద్ , డీసీసీ ప్రధాన కార్యదర్శిమహమ్మొద్ షాబోద్దీన్ లు పాల్గొని వారు మాట్లాడుతు బీజేపీ ప్రభుత్వం రెండు నాలుకల ధోరణిల ప్రవర్తిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం, మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి దేశ చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా ఎస్సి వర్గీకరణ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందాన్నారు. అంతే కాకుండా బీసీ అని చెప్పుకునే నరేంద్రమోడీ బీసీలపై చిత్తశుద్ధి ఉంటే గత 10 ఏండ్లుగా కేంద్రంలో అధికారం లో ఉండి బీసీలకు రిజర్వేషన్ ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు మా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించి అసెంబ్లీ లో బిల్లు ఆమోదింపజేసిందన్నారు ఇకనైనా ఈ బీజేపీ నాయకులు బీసీలపై చిత్త శుద్ధి ఉంటే పార్లమెంట్ లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి బిల్లును ఆమోదింప చేయాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చందబోయిన పరశురాం, వికలాంగుల విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సింగరాల రాజు ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి ఫిషర్మెన్ జిల్లా కార్యదర్శి గుండు వెంకట్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కొమ్ము ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, నాయకులు నముండ్ల వినోద్, బైరి యాదగిరి,కొమ్ము ఎల్లయ్య, మెట్ల అజయ్, దొంతర బోయిన సంపత్, రాజా వర్దన్ రెడ్డి, ఉడుత వేణు, కొమ్ము నర్సింలు, నూనె నర్సింలు, కొట్టే సంపత్, ఎల్లారెడ్డి, కర్రె మధు, దుగ్యాని వెంకటయ్య, పంతం శీను, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత సన్నబియ్యం పథకం ప్రారంభం



**చట్టం, కోరుట్ల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ సర్కార్ పేదలకు ఉచిత సన్నబియ్యం పథకం అమలు సందర్భంగా అయ్యప్ప గుట్ట 5 వ వార్డు రేషన్ షాపు వద్ద, కోరుట్ల పట్టణంలో పలు రేషన్ షాపులలో లబ్దిదారులతో కలిసి ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు బింగి వెంకటేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోరుపాక రమేష్, మాట్లాడుతూ.. గతంలో కరోనా మహమ్మారి మన దేశంలో చోటబద్ద రోజుల్లో దేశ ప్రజలు మధ్యతరగతి, దారిద్రరేఖకు దిగువనున్న పేదలు పనిలేక ఆకలితో ఏ ఒక్క పౌరుడు ఆకలి చావుకు గురికావద్దని ఒక మహా ఆలోచనతో ఆరు సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉచిత రేషన్ పథకాన్ని తీసుకొచ్చారని కరోనా తర్వాత కూడా ఆ పథకాన్ని అలాగే కొనసాగిస్తూ ఉన్నారని, ఇప్పుడు ఆ బియ్యాన్ని సన్నబియ్యంగా మనకు అందజేస్తున్నారని ప్రతి పేదవాడు సన్నబియ్యంతో కడుపునిండా ఆహారం తీసుకోవాలన్నదే ప్రధాని మోడీ ఆలోచన విధానమని అలాంటి నాయకుడు మనకు ప్రధానిగా ఉండడం ప్రతి భారతీయ పౌరుడు గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధవేణి మహేష్, ప్రధాన కార్యదర్శి ఇట్యాల నవీన్ కుమార్, బీజేవైఎమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాడిగే మహేష్, ఎర్ర రాజేందర్, తైదల ప్రశాంత్, వాసం లోకేష్, గుండేటి శివ, గోదా శ్రీకాంత్, సంకు రమేష్, బీజేపీ బీజేవైఎమ్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పట్టణ ప్రజలు రేషన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలు



చట్టం రామగుండం: ఇవాళ రేపు రహదారులపై ప్రయాణం చేయాలంటే ఇంటికి సురక్షితంగా వెలుతామన్నా నమ్మకం రాను రాను పోతుంది. అతి వేగం తో ద్వి చక్రవాహన వాహనాల కన్నా మిగతా వాహనాలు మితి మీరిన వేగం తో రహదారుల మీద ప్రయాణం చేస్తున్నాయి. సగటు మనిషి రహదారుల పైన ప్రయాణం చేయాలంటే భయం వేస్తుంది. వివరాల్లోకి వెళితే గురువారం సాయంత్రం జిఎం ఆఫీస్ దగ్గర ఉన్న మూల మలుపు జాతీయ రహదారి లో పత్తి లోడ్ తో వెళుతున్న లారీ,మంచిర్యాల నుండి బెంగళూరు వెళుతున్న ప్రైవేట్ బస్సు అతి వేగం తో ఒకరికి ఒకరు పోటీ పడుతూ మూల మలుపు దగ్గర ప్రమాదానికి దారి తీసాయి. ఆ సమయం లో ద్వి చక్ర వాహనాలు, ఏ ఇతర వాహనాలు లేకపోవడం తో భారీ ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ పోలీస్ లు ఎన్ని సైన్ బోర్డ్స్ పెట్టిన ఈ ప్రమాదాలను అరికట్టలేక పోతున్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వలన ఈ మూల మలుపు దగ్గర ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రైవేట్ బస్సు లో ముగ్గురు ప్రయాణికులు ఉండడంతో ఎవరికీ ప్రమాదం జరుగలేదు,ఒకవేళ బస్సు లో చాలా మంది ప్రయాణికులు ఉండి ఉంటే పరిస్థితి ఇంకోలా ఉండేది. డ్రైవర్లు అతి వేగం తో వాహనాలు నడుపడం ద్వారా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టాలంటే అక్కడ ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ పాయింట్ ఒకటి కచ్చితంగా ఉండి కెమెరా పాయింట్ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.అలాగే డివైడర్ మధ్యలో చెట్లు లేకుండా ఉండాలని కోరుకుంటున్నారు.

# అంబేద్కర్ బహిష్కృత్ భారత్ కు నేటికి 98 ఏళ్ళు



▶ జర్నలిజంలో తిరుగులేని అంబేద్కర్ పాత్ర.

**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** భారత దేశంలో స్వతంత్ర ఉద్యమ కాలంలో అంబేద్కర్ పోరాటంపై పత్రికలు చేస్తున్న దాడులు చేస్తున్న కాలం. ఆలా అంబేద్కర్ కొత్త పత్రిక ఏర్పాటు కు సన్నద్ధం అయ్యారు. 1927 ఏప్రిల్ 3న బహిష్కృత భారత్ పక్ష పత్రిక ను మారాఠి భాషలో తీసుకు వచ్చారు. ఇలా ఈరోజు తో 98 ఏళ్ళు పూర్తి అయ్యాయి. అంతకు ముందే మొట్ట మొదటిసారి 1920 జనవరి 31 న మూక్ నాయక్ పత్రిక ను స్థాపించారు. నాలుగేళ్ల పాటు కొనసాగింది. ఆ తరువాత 1927 ఏప్రిల్ 3న మరాఠి భాషలో బహిష్కృత భారత్ పక్ష పత్రిక ను ఏర్పాటు చేసారు. ఈ పత్రిక కూడా రెండేళ్ల పాటు నడిచి అప్పుల కారణంగా ఆగిపోయింది. ప్రభాకర్ గాజబియే సంపాదకత్వంలో మొదలు అయిన ఈ పత్రిక చివరి సంచిక 1929 నవంబర్ 19 న విడుదల అయింది. ఆలా అంబేద్కర్ మార్గదర్శకత్వంలో 1928 జూన్ 29 న సమత పక్ష పత్రిక 1930 నవంబర్ 24న జనతా పక్ష పత్రిక లు నడిచాయి. చివరకు అంబేద్కర్ సారథ్యంలో 1956 ఫిబ్రవరి 4న ప్రబుద్ధ భారత్ పత్రిక ను మొదలు పెట్టారు. ఇదే చివరి పత్రిక అయింది. ఇలా అంబేద్కర్ జర్నలిస్టుగా 1920 నుంచి 1956 వరకు 36 సంవత్సరాలు పాటు నిరంతరాయంగా కొనసాగింది.

**బహిష్కత భారత్ పాత్ర...**

అంబేద్కర్ 1927 లో చేసిన ఉద్యమాలు దేశంలోనే రెండు వైపుల చరిత్రకి ఎక్కాయి. ఒకటి బ్రిటిష్ పాలన, రెండోది బ్రాహ్మణ పాలన కు సవాల్ గా మారాయి. 1927 జనవరి 1న భీమా కోరేగావ్ లో మహర్ పోరాట వీరుల చరిత్ర వెలికి తియ్యడం, మహాడ్ చెరువు సత్యగ్రహంతో మహాడ్ చెరువు నీళ్లు తాగడం, మనుస్మృతిని దహనం చేయడం, అదే ఏటా బొంబాయి శాసన మండలికి ఎంపిక కావడం లాంటి కీలక పరిణామాలు జరిగాయి. వీటి ప్రభావంతో ద్విజుల నియంత్రణలో ఉన్న పత్రికల్లో అంబేద్కర్ పై, అయన ఉద్యమాలపై తప్పుడు ప్రచారం మొదలు పెట్టాయి. వీటికి విరుగుడుగా అంబేద్కర్ అంబేద్కర్ బహిష్కృత భారత్ పత్రికను ఏర్పాటు చేసి తన ఉద్యమాలు, బ్రిటిష్ పాలన, దేశంలో పరోక్షంగా బ్రాహ్మణ పాలన గురుంచి రచనలు చేశారు.

# అర్హులైన వారికి ప్రతి ఒక్కరికి లోన్లు అందిస్తాం



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గురువారం మాదిగల అంబేద్కర్ సంఘం మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు కలవడం జరిగింది. కార్పొరేషన్ లో రాజకీయ నాయకుల అనుచరులకు ఇవ్వము అని మాట ఇచ్చారు. ఈడి ప్రతి ఒక్కరికి అర్హులైన వారికి లోన్లు ఇస్తామని చెప్పినారు. మహనీయుల జయంతుల గురించి మాట్లాడడం జరిగింది. అన్ని సంఘాలకు పిలుపు ఇవ్వాలని ప్రతి ఒక్క సంఘాల అభిప్రాయాలను తీసుకొని మహనీయుల జయంతులు ఘనంగా నిర్వహించాలని కోరడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో మాదిగల అంబేద్కర్ సంఘం వ్యవస్థాపకులు నిగులపు లింగన్న మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు శనిగారపు రవి కొలగని రాజు బండి మోహన్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# వీర తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య గారి జయంతి



**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం. దౌలత్ పూర్. గ్రామంలోని మల్లన్న మందిరం ముందు తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమరయ్య గారి జయంతి గ్రామ సర్పంచ్ సాయి గౌండ. అధ్యక్షతన జయంతి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా. సిఐటియు. జిల్లా కమిటీ సభ్యులు. సురేష్ గౌండ హాజరై మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ మరో భగత్ సింగ్ లాగా అతి చిన్న వయసుడైన 19 సంవత్సరంలో ఆంగ్లేయులను రజాకారులను ఎదిరించిన మరో పోరాటయోధుడని దొడ్డి కొమరయ్య గారు మన కురుమ కుల బాంధవులందరికీ ఆదర్శ పోరాటయోధుడని మనమందరం దొడ్డి కొమరయ్య గారిని ఆదర్శంగా తీసుకొని మన కుల సోదరుల ఐక్యతకై మన హక్కుల కై మన కురుమ కులాస్తులందరిని ఎస్టి లుగా గుర్తింపు పొందే వరకు మనమందరం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఈ సందర్భంగా సురేష్ గౌండ కురుమ కుల బాంధవులందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో. గుండె కల్లూరు. గ్రామ మాజీ సర్పంచ్. సాయి గౌండ. దౌతాపూర్. గ్రామ కుల బంధువులు. నాగ గౌండ మహారాజ్. మొగుల గౌండ. హనుమంతరావు. లక్ష్మణ్. వీరేశం. గంగారం తదితరులు పాల్గొన్నారు.

# నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు



**చట్టం, ఇందల్వాయి :** ఇందల్వాయి మండలంలోని తిరుమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెండున్నర కోట్ల రూపాయలతో సబ్ స్టేషన్ను సాంక్షన్ చేయించిన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి. అనంతరం గ్రామ మాజీ ఎంపీటీసీ కిషన్ మాట్లాడుతూ.. పది సంవత్సరాల్లో కాని పని 11 నెలల్లో చేసి చూయించిన డాక్టర్ భూపతి రెడ్డికి తిర్మనపల్లి గ్రామ ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారని ఆయన అన్నారు. అడగగానే సిసి రోడ్లు మరమ్మతుల కొరకు వెనుకంచ వేయకుండా గ్రామాన్ని దృష్టిలో ఉంచుకొని సాంక్షన్ ఇచ్చిన ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. మరెన్నో అభివృద్ధి పనులు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడిసి సభ్యులు గ్రామ ప్రజలు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్టీపీసీపై చర్యలు తీసుకోండి

▶ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రికి పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ లేఖ.



**చట్టం రామగుండం:** పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకోకుండా పలు నిర్మాణాలు చేపట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎన్టీపీసీ సంస్థపై చర్యలు తీసుకోవాలని, ఆ సంస్థకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్లాల్ ఖట్టర్ ను కోరారు. అనుమతి లేకుండా ఎన్టీపీసీ టౌన్ షిప్ లోని ఆరు ప్రాంతాలలో చేపట్టిన నిర్మాణాలపై రామగుండం కార్పొరేషన్ రూ.99.28 కోట్ల భారీ ఫెనాల్టీ విధించిన విషయాన్ని లేఖ ద్వారా గురువారం కేంద్ర మంత్రి దృష్టికి ఎంపీ తీసుకెళ్ళారు. మున్సిపల్ నిబంధనలను ఎన్టీపీసీ సంస్థ ఉల్లంఘించడం ఆక్షేపనీయమని, వాటిని గౌరవించకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని ఎంపీ పేర్కొన్నారు. ఎన్టీపీసీ సంస్థ చట్టబద్ధమైన విధానాలను, స్థానిక నిబంధనలను పాటిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందనేది గుర్తించాలని సూచించారు. భవిష్యత్ లో అక్రమ నిర్మాణాలను మళ్ళీ చేపట్టకుండా ఎన్టీపీసీ సంస్థ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలకు భారీ ఫెనాల్టీ అంశాన్ని అత్యంత బాధ్యతాయుతంగా తీసుకుని తగిన పరిష్కార చర్యలను చేపట్టాలని, రామగుండం ప్రాంత అభివృద్ధికి సహకారాన్ని అందించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు.

# ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై మధుయాష్కీ గౌడ్ ఫైర్

- సిగ్గు, శరం ఉంటే కార్పొరేటర్ సుజాత నాయక్ కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి క్షమాపణ చెప్పాలి
- ఆమెను అవమానించినందుకు కాళ్లు కడిగి నెత్తిన పోసుకొని క్షమాపణ కోరాలి: మధుయాష్కీ గౌడ్



**చట్టం, వనస్థలిపురం:** కార్పొరేటర్ సుజాత నాయక్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సహించరానివని, సుధీర్ రెడ్డికి నీతి, నిజాయితీ, సిగ్గు , శరం, లజ్జ ఉంటే సుజాత నాయక్ కాళ్ళు మొక్కి క్షమాపణ వేడుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. వనస్థలిపురం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. మహిళలను గౌరవించాల్సిన సంస్కారం , సభ్యత సుధీర్ రెడ్డికి లేదని విమర్శించారు. గిరిజన మహిళా కార్పొరేటర్ వ్యక్తిత్వాన్ని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సుధీర్ రెడ్డి ఇప్పటి వరకు క్షమాపణ చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. మీ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారు కదా..? ఇలానే ఎవరైనా మాట్లాడితే ఊరుకుంటావా ? అని ప్రశ్నించారు. ఏమాత్రం నీతి , నిజాయితీ ఉన్నా సుధీర్ రెడ్డి .. కార్పొరేటర్ సుజాత నాయక్ కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుధీర్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినందున న్యాయపరంగా పోరాటం ఉంటుందని, పోలీసులు కూడా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమాపణ చెప్పకపోగా..కాపాడాలని అసెంబ్లీ లాబీలలో సీఎం, మంత్రుల కాళ్లు పట్టుకొని బతిమిలాడుతున్నాడని ఆరోపించారు. సుధీర్ రెడ్డి మాట్లాడిన మాటలు సభ్య సమాజం అసహ్యించుకుంటుందని, ఆయన పార్టీ అధినేత కేసిఆర్ కూడా క్షమించటం లేదని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి గత బీఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాలలోరాని నిధులు ..15 నెలల తమ రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే తట్టుకోలేక, దొంగచాటున భూములు కబ్జాలు చేసే గల్లీ లీడర్లు, రౌడీ షీటర్లను వెంట వేసుకొని వెళ్లి సుధీర్ రెడ్డి కొబ్బరికాయలు కొడుతూ శంకుస్థాపనలతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. మీ తొట్టి గ్యాంగుల ఆటలు సాగవని హెచ్చరించారు. పార్కులకు తాళాలు వేస్తున్నారని అబద్ధాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నాడని, పార్కుల పేరుతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ సంపాదనతో సుధీర్ రెడ్డి వేలకోట్లకు ఎదిగాడని ఆరోపించారు. మలక్ పేట్ లో సుధీర్ రెడ్డి సైకిల్ పై తిరిగే రోజుల్లో, తాను బైక్ పై తిరిగానని.. కానీ అక్రమ సంపాదనతో ఈరోజు సుధీర్ రెడ్డి వేలకోట్లకు పడగలెత్తాడని విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ప్రకారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా అభివృద్ధి పనులకు తాను సహకరిస్తున్నానని, రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేపట్టాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఈనెల 7న ఎల్బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు హాజరు అవుతున్నారని, ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే కూడా వచ్చి కొబ్బరికాయ కొట్టవచ్చునని పేర్కొన్నారు. అంతేకాని తన జేబులో నుంచి డబ్బులు ఇస్తున్నట్లుగా దొంగచాటుగా కొబ్బరికాయలు కొట్టి.. చిల్లర రాజకీయాలు చేయవద్దు అని హెచ్చరించారు. మంత్రి హాజరయ్యే రోజున కొబ్బరికాయ కొట్టి ఆ నీళ్లు నెత్తిన చల్లుకొని సుజాత నాయక్ ని క్షమాపణ కోరాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర రెడ్డి, బానోతు సుజాత నాయక్, పీసీసీ సెక్రెటరీ గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహా యాదవ్, చెన్నగోని రవీందర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, మంజుల రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్ , బుద్దా సత్యనారాయణ, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి సాయి నికేష్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గజ్జి శ్రీనివాస్ యాదవ్, బండి గారి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం సుజాత రెడ్డి, వసంత, రాజేశ్వరి, రజిని రావు, అనసూయ కవిత, పుష్పనీలా, మణి శ్రీ, ఎస్టీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు రమేష్ నాయక్, భీముడి రామకృష్ణారెడ్డి, కోటగిరి శ్రీనివాస్, చెరుకు భవాని శంకర్, గుర్రం చంద్రశేఖర్, విజయ పాల్ రెడ్డి, బోడ రాజశేఖర్, తోకటి కిరణ్, కారుకొండ శివ, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ఏర్పాట్లు పరిశీలన



**చట్టం /పరకాల ;** పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళా రేపు ఈ నెల 4వ తేదీన లలిత కన్వెన్షన్ హాల్ జరిగే పరకాల నియోజకవర్గం జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు జిల్లా వైద్య ఆరోగ్యాశాఖ అధికారి డాక్టర్ అల్లె మ్ అప్పయ్య మరియు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లలితాదేవి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించినారు. రేపు అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొనే అవకాశం ఉన్నందున శాసన సభ్యులు మరియు కలెక్టర్ ఆదేశాల ప్రకారం మెడికల్ క్యాంపు ను ఏర్పాటుకు పరిశీలన చేసి స్థానిక రాయపర్తి పి హెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో డాక్టర్ లను సిబ్బందిని మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాల్సిందిగా డి ఎమ్ హెచ్ ఒ అదేశించినారు. వారి వెంట డాక్టర్ కొక్కొండ దివ్య, పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ, పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాల సీజ్



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామ శివారులోని చెరువు దగ్గర గురువారం రోజు ఉదయం పూట 6:30 గంటల ప్రాంతంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్నటువంటి ఒక జేసిబి, 5 ట్రాక్టర్లను సీజ్ చేసి, వాటి డ్రైవర్ల పై, ఓనర్లపై ఆర్మూర్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏ ఎస్సై సేవలు అభినందనీయం..

- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పక ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. మార్చ్ నెలలో పదవి విరమణ పొందిన సిబ్బందిని ఆయన గురువారం కమిషనర్ కార్యాలయంలో సన్మానించారు. నగరంలోని నాలుగో టౌన్ ఏఎస్ఐ కే.రాఘవేందర్ రావును పదవి విరమణ సందర్భంగా సన్మానించారు. పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటిరిమార్కు లేకుండాపదవి విరమణ చేయడం ఎంతో గోప్పవిషయమని అన్నారు. డిపార్టుమెంటల్కు చేసిన సేవలు ఎంతో ఘననీయమని కొనియాడారు. పదవి విరమణ అనంతరం ఎలాంటి అవసరం వచ్చిన ఎల్లవేళల సహాయపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంటు శంకర్, రిజర్వు ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్, తిరుపతి, అసోసియేషన్ అధ్యక్షులు షకీల్ పాషా, వారికుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని 36 వార్డులలో స్థానిక సమస్యలు పరిష్కారం చేయాలని గురువారం రోజు సిపిఎం పార్టీ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, మాట్లాడుతూ ఆర్మూర్ లో కోతుల బెడద బాగా ఉంది అని రాత్రి పూట కుక్కలు వీధులలో తిరుగుతున్నాయి. చిన్న పిల్లలను సైతం కరుస్తున్నాయని అన్నారు. వాటిని నివారించాలని, 1300 ఫ్లాట్ లలో డ్రైనేజీ సరిగా లేదని, రోడ్లు సరిగా లేవని, రాంనగర్ కాలనీలలో డ్రైనేజీ సరిగా లేక నీళ్లన్నీ ఆగిపోతున్నాయని అన్నారు. టీచర్స్ కాలనీ నుండి రాజారాం నగర్ పోయే డిపెండెన్స్ స్కూలు వెనకాల ఉన్న రోడ్డు మొత్తం కొట్టుకుపోయి వాహనాలు వెళ్ళలేని పరిస్థితి వుంది దాన్ని వెంటనే బ్లేడు బండితో సరి చేయాలని రాజారామ్ నగర్ స్మశాన వాటికకు రోడ్డు చేయాలని అన్నారు. యానం గుట్ట సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎన్ని సంవత్సరాలుగా నిరుపేదలు అక్కడే నివాసముంటున్నప్పటికిని పలుమార్లు అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చిన సమస్య పరిష్కారం చేయడానికి కృషి చేయడం లేదని రాత్రిపూట పాములు, తేళ్లు వస్తున్నాయని వెంటనే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాలకు ఐదు లక్షలు లోను ఇస్తామని ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసింది, ఇప్పటికీ ప్రారంభించలేదు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు లేని వారందరికీ రేషన్ కార్డు ఉగాదికి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటికీ రేషన్ కార్డు ఇవ్వలేదు. ఎంపికైన లబ్ధిదారులకు రేషన్ కార్డు వెంటనే ఇచ్చి సన్న బియ్యం కూడా వారికి అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ పట్టణ కార్యదర్శి కూతాడు ఎల్లయ్య, నాయకులు బొర్రా నాగరాజు, సుజాత, నవీద్ భాయ్, లాల్య నాయక్, రఫీ ఖాన్, శర్మ, రజియా సుల్తానా, రసీదా బేగం మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## టేక్రియల్ శివారు లో దారి దోపిడి



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** దేవునిపల్లి శివారులోని టెక్రియాల్ శివారులో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కారులో నిద్రిస్తున్న వారిపై దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వీర రాఘవయ్య తన కుమారుడి పదోతరగతి పరీక్షలు పూర్తి కావడంతో తీసుకురావడానికి తన మిత్రుడితో కలిసి బుధవారం హైదరాబాద్ వెళ్లాడు. తన కుమారుడిని తీసుకుని తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి నిద్రరావడంతో టెక్రియాల్ గ్రామ శివారులోన ఒక దాబ వద్ద ఆగి తన కారులో నిద్రిస్తున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున కొందరు దుండగులు కారు అద్దాలు పగులగొట్టారు. అద్దాలు పగిలిన శబ్దానికి వీరరాఘవయ్యకు మెలుకువ వచ్చి ఎవరు మీరు అని ప్రశ్నించారు. వెంటనే దుండగులు వీర రాఘవయ్య కుమారుని మెడపై కత్తి పెట్టి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే దుండగులు రాఘవయ్య కుమారుడి ల్యాప్ టాప్ ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యారు. కారు అద్దాలు పగులగొట్టే సమయంలో రాఘవయ్య ముఖానికి రాయి వచ్చి తగలడంతో గాయాలయ్యాయ. వెంటనే అక్కడి నుంచి బయలు దేరి డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా సలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితులు 3 న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## విలేకరులతో చిట్ చాట్ లో పాల్గొన్న ఎమ్మెల్యే పైడి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో గురువారం రోజు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ విలేఖరులతో ఆయన నివాసంలో చిట్ చాట్ కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలలో గెలిచిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి పనులలో భాగంగా హైదరాబాదులో అధిక సమయం కేటాయించాల్సి వచ్చిందని తెలిపారు. ఇన్ని నెలల పాలనలలో అవినీతికి ఆమడ దూరంలో ఉన్నానని, గతంలో నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలైన రౌడీయిజం, గంజాయి చాలా వరకు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. త్వరలో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారి నుండి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ లో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గడచిన ఏడాదిన్నర పాలనలో అభివృద్ధి చేసిన కార్యక్రమాలను వివరించారు. నియోజకవర్గంలో చేయవలసిన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి పలువురు విలేకరులు పలు సలహాలు, సూచనలు అందించారు.

## అక్రమ ఔట్ సోర్సింగ్ నియామకాలను రద్దు చేయాలి

- నేడు కలెక్టరేట్ ముందు ధర్నా
- కలెక్టరేట్ కార్యాలయానికి తరలిరావాలి..



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఇటీవల నిబంధనల విరుద్ధంగా ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించిన ఉద్యోగులను వెంటనే తొలగించాలని,అక్రమాలకు పాల్పడిన వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టిఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు కుంబాల లక్ష్మణ్ యాదవ్ లు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు, కుంభాల లక్ష్మణ్ యాదవ్ లు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవలే కామారెడ్డి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా జరిపిన నియామకాలు అక్రమమని,ఒక్కొక్క అభ్యర్థి నుండి లక్షల రూపాయల తీసుకుని ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందని ఏ పాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారో కూడా ఇప్పటి వరకు తెలియజేయడం లేదని అన్నారు. అవినీతికి పాల్పడిన ఏజెన్సీ నిర్వాహకుల పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అర్హులైన వారందరికీ ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలను నిరసిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి గతంలో దరఖాస్తు చేసుకున్న వారందరూ రావాలని పిలుపునిచ్చారు. అన్ని రకాల అర్హతలు ఉన్నవారికి ఉద్యోగాల ఇవ్వకుండా డబ్బులు ఇచ్చిన వారికే ఉద్యోగాలు ఇవ్వడం కామారెడ్డి జిల్లాలోని అవినీతికి నిదర్శనంగా కనబడుతుందని ఇలాంటి అవినీతి కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క నిరుద్యోగి పైన ఉన్నదని లేకపోతే భవిష్యత్తులో ఇలాంటి అవినీతి అక్రమాలు పెరిగిపోతాయని అన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- దామెర మండలం ల్యాదెల్లలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్





**చట్టం /హనుమకొండ:** మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా మండలం ల్యాదెల్ల గ్రామంలో సాగునీటి పారుదల శాఖ భవనాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి ఆధ్వర్యంలో వి హబ్ సహకారంతో ఏర్పాటు చేయనున్న పరకాల స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను ఎమ్మెల్యే, కలెక్టర్ సందర్శించారు. మహిళల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో నెలకొల్పాల్సిన మౌలిక వసతులు, ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిని గురించి ఏర్పాట్లను గురించి డిఆర్డీవో మేన శ్రీను, సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్యే, కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ త్వరలో ప్రారంభించనున్న మహిళల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో కావాల్సిన అన్ని వనరులు, సదుపాయాలను అధికారులు త్వరగా సమకూర్చాలన్నారు. మహిళలకు వివిధ ఉపాధి అంశాల గురించి తెలియజేసేందుకు శిక్షణ కేంద్రంలో అనువుగా భవనం ఉండాలన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో మహిళలు ఆర్థిక పురోగతిని సాధించేందుకు శిక్షణా కార్యక్రమాలు అందించే ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, ఆర్డీవో డాక్టర్ కె నారాయణ తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాప్ టాప్ గెలిచిన విద్యార్థి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబర్చారు. జాతీయ స్థాయిలో రెండు దశలలో జరిగే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఎగ్జామ్ చివరి దశలో 4వ తరగతి చదువుతున్న మహాస్విన్ పవర్ గ్రాండ్ ప్రైజ్ లెనోవా ల్యాప్ టాప్ గెలుపొందారు. అలానే 207 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యి ప్రత్యేక బహుమతులను, బంగారు పతకాలను గెలుపొందారు. అర్హత సాధించిన 207 మందిలో 11 మంది ట్యాబ్, స్మార్ట్ వాచెస్, ఇతర బహుమతులు గెలుపొందారు. 133 మంది బంగారు పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ముత్తు నందిపాటి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఆర్మూర్ పేరు నిలబెట్టిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ జీ ఎం సతీష్ రెడ్డి, కో ఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, ప్రసన్న, డీన్ రాకేష్, సి ఇన్చార్జి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## వీర శైవ లింగాయత్ సమాజ్ సభ్యులను అడ్డుకున్న పోలీసులు



**చట్టం కామారెడ్డి ప్రతినిధి;** కేదార్ శివాచారి మహారాజ్ నిజామాబాద్ నగరంలోని నందిగుట్ట విగ్రహ ప్రతిష్టాపన కోసం బుధారం నిజామాబాద్ కు వచ్చారు. శాంతియుతంగా గురుద్వార్ నుంచి గాజుల్ పేట్ వీరభద్ర స్వామి గుడి వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ర్యాలీని పోలీసులు నగరంలోని రెండవ టౌన్ పరిధిలో అడ్డుకున్నారు. దీంతో వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న త్రీ టౌన్ ఎస్ఐ హరిబాబు, రెండవ టౌన్ ఎస్ఐ హనుమాన్లు పరిస్థితిని సముదాయించు ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో బిజెపి మాజీ కార్పొరేటర్ ఇల్లందులో మమతా ప్రభాకర్ బిజెపి నాయకులు బాలకృష్ణ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బాలుడు అదృశ్యం



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** నగరంలోని ఒకటో టౌన్ పరిధిలో బాలుడు అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ ఎస్ ఎచ్ ఓ బి.రఘుపతి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కోటగిరి మండలానికి చెందిన వాగ్మారీ పూజ వ్యవసాయ కూలిగా పని చేస్తూ జీవనం సాగిస్తోంది. గత నెల 31న రంజాన్ సందర్భంగా తనకుమారుడు, అత్త, మామలతో కలిసి నగరంలోని బోధన్ బస్టాండ్ వద్దకు వచ్చింది. అక్కడ తన అత్తమామలతో తన కుమారుడు సంతోష్ బయటకు వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన బాలుడు ఎంతకూ తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. బాలుడి తల్లి వాగ్మారి పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా బాలుని ఆచూకీ తెలిస్తే 91 87126 59714, 9441058289 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

## పేదలకు సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం



**(చట్టం కామారెడ్డి ప్రతినిధి)** దేశ చరిత్రలోనే పేదలకు ప్రజా పాలన ప్రభుత్వం రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేదల సంక్షేమం అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమవుతుందని కామారెడ్డి జిల్లా మాజీ యూత్ జాయింట్ సెక్రటరీ అజ్జుబాయ్ అన్నారు. రేషన్ ద్వారా పేదలకు బియ్యం పంపిణీ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం పెట్టాలని లక్ష్యంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తే ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు పేదలకు కడుపునిండా అన్నం పెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు కుటుంబంలో ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ద్వారా 6 కిలోల సన్న బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ కృషితో అటు సంక్షేమం ఇటు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు వందల కోట్ల నిధులతో ఇప్పటికి కామారెడ్డి మున్సిపాలిటీలో , మాచరెడ్డి మండలంలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు గ్రామాల అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు

## రైల్వే స్టేషన్ లో తనిఖీలు



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** నిజామాబాద్ ఏసీపీ ఆదేశాల మేరకు నగరంలోని రైల్వే స్టేషన్ లో గురువారం తనిఖీలు నిర్వహించినట్లు ఒకటో టౌన్ ఎస్ఎచ్ఓ రఘుపతి తెలిపారు. రైల్వే స్టేషన్ ఆవరణలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమాస్పదంగా తిరుగుతున్న, గంజాయి అమ్ముతున్న డయల్ 100 నెంబర్ కాల్ చేసి చెప్పాలని సూచించారు. ఈ తనిఖీల్లో నలుగురు ఎస్ఐలు, 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

# ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయం లో మహిళా సంఘాల ప్రతినిధులకు ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. మండలానికి 5 సంఘాలకు కొనుగోలు బాధ్యతలు అప్పగించామని డీపీఎం రమేశ్ తెలిపారు. మండలంలోని తిమ్మక్ పల్లి(కె), కోటాల్ పల్లి, క్యాసంపల్లి తండా, రాఘవపూర్, గూడెం గ్రామాలకు కొనుగోలు కేంద్రాలు కేటాయించినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, తేమశాతం 17 ఉంటే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. దొడ్డు, సన్న రకం ధాన్యాలను వేర్వేరుగా కొనుగోలు చేసి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హెప్సిబా రాణి వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

# సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండల కేంద్రంలో స్పాట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రోజు ఆదిశంకరాచార్య భగవాన్ నామ సంకీర్తన మండలి పురోహితుల చేత సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది మహిళలు, యువతులు పాల్గొని, భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామాన్ని జపిస్తూ కుంకుమార్చన నిర్వహించారు. పురోహితులు భగవంతుని రూపం, అమ్మవారి తత్త్వం, ఆవిర్భావం, పూజా విధానం, లలితా సహస్రనామ కుంకుమార్చన విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి స్పాట్ యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాలుగోన్నారు.

# సత్ప్రవర్తనతో సరైన దారిలో నడవాలి..

**... జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి నాగరాణి..**



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యం లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టీ నాగరాణి కామారెడ్డి ఉప కారాగారాన్ని గురువారం సందర్శించారు . అలాగే ఖైదీల సౌకర్యాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీ లకు వాళ్ళ హక్కులు చట్టాలు గూర్చి వివరించారు. సత్ప్రవర్తనతో మెదిలి సరైన దారిలో నడవాలని సూచించారు కంప్లయింట్ బాక్స్, వంట గది, పరిసర ప్రాంతాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం లో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది మాయ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ శ్రీనివాస్ రావు సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవ రెడ్డి ,జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది ఖాజా సమీ ఉల్లాహ్ ఖాన్, సాయికృష్ణ పాల్గొన్నారు.

# జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండలం గగ్గుపల్లి, మచర్ల గ్రామాలలో ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం2 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని గురువారం రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణు ప్రసాద్, గగ్గుపల్లి, మచర్ల, గ్రామ కార్యదర్శులు కిషోర్, నసీర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ ఆశయాల సాధనలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు కిషోర్, నసీర్ లు మాట్లాడుతూ, విద్యా వాలంటీర్ల సేవలను అభినందిస్తూ, గ్రామ సమస్యలపై చైతన్యం కల్పించేందుకు ఈ శిబిరం దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జార్ సింగ్, శ్యామ్, జాన్ సుకుమార్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, నారాయణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణానికి భూమి పూజ



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండలం, దేగం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టులో భాగంగా సైన్స్ లాబ్ భవన నిర్మాణానికి గురువారం రోజు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, హాజరై భూమి పూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి, ఆలూర్ మండల అధ్యక్షుడు సూర్య శ్రీకాంత్, ఆర్మూర్ నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, గ్రామ విడిసి పెద్దలు, స్కూల్ కమిటీ చైర్మన్ సుదర్శన్, గంగాధర్, భోజన సెక్రటరీ శ్రీనివాస్, ఏఈ మారుతి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం తీరుపై బీజేవైఎం నిరసన..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** ప్రభుత్వం హెచ్‌సీయూ భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు హెచ్చరించారు. హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీఛార్జ్, బీజేవైఎం నాయకులపై పోలీసుల తీరును నిరసిస్తూ గురువారం నిజాంసాగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వర్సిటీ భూములను కాపాడుకోవడం కోసం ఎన్ని ఉద్యమాలైనా చేస్తామన్నారు. విద్యార్థులపై లాఠీ ఛార్జ్ కు బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు విపుల్, జిల్లా ధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, నాయకులు రత్, లక్ష్మిపతి, రాజేష్, రాజగోపాల్, సురేష్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండల కేంద్రంలో గురువారం రోజు కుర్మే సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుల సభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య తన ప్రాణాలను అర్పించి, రాష్ట్ర ప్రజలకు స్వేచ్ఛా వాయువులను అందించేందుకు మార్గం సుగమం చేశారని కొనియాడారు. ఆయన త్యాగాలు తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో లాడే అనిల్, కుర్మే చిరంజీవి, అరుణ్, హరీష్, శేఖర్, మహేష్, సురేష్, మల్లయ్య, సాయన్న, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ శూద్ర ఆత్మాభిమానానికి నిదర్శనం

- **బ్రాహ్మణ దురాహంకారాన్ని ధిక్కరించిన బహుజన చక్రవర్తి శివాజీ**
- **చత్రపతి శివాజీ పౌరుషాన్ని, సాహూ మహారాజ్ సమతా స్ఫూర్తిని మనమంతా అందిపుచ్చుకోవాలి**
- **సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు సమతా ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం ప్రమీల - నగేష్ లు**



**చట్టం రామగుండం:** చత్రపతి శివాజీ మహారాజ్ శూద్ర ఆత్మాభిమానానికి నిదర్శనమని సమతా సైనిక దళాలు రాష్ట్ర నాయకులు సమతా ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం ప్రమీల నగేష్ లు అన్నారు. గురువారం సమతా సైనిక దళ్ ఎన్టిపిసి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 345 వ వర్ధంతి కార్యక్రమానికి సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమత ఫౌండేషన్ చైర్మన్ మార్షల్ దుర్గం ప్రమీల నగేష్ లు హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహారాష్ట్ర లో వెనుకబడిన జాతిలో శివాజీ 1630 ఫిబ్రవరి 19 న జన్మించారన్నారు. శివాజీ తల్లి జిజియా బాయి పర్యవేక్షణలో గొప్ప వీరునిగా ఎదిగి పీష్వా చిత్ పవన్ బ్రాహ్మణులను ఎదిరించి బీజాపూర్ సుల్తాన్ ని ఓడించారన్నారు, రాయ్ ఘడ్ ను రాజధాని గా చేసుకుని శివాజీ స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని కొల్పారని తెలిపారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ లోతైన వాస్తవిక చారిత్రక పరిశోధన ,అధ్యయనం వలన మహాత్మా జోతిరావు పూలే, శివాజీల అసలైన చరిత్ర మనకు లభించిందన్నారు. బ్రాహ్మణ అహమాతలు ,అమానవీయ అధర్మానికి వ్యతిరేకంగా మహాత్మా జోతిరావు పూలే చేసిన పోరాటం, అతని చరిత్రను మరుగున పరిచేసినప్పటికీ బాబాసాహెబ్ అంబేడ్కర్ వెలికితీసి పూలేను తన గురువుగా ప్రకటించుకుని పూలే నడిపిన పోరాటాన్ని కొనసాగించాలని తెలిపారు.ఛత్రపతి శివాజీ పీష్వా బ్రాహ్మణుల యొక్క దుర్మార్గాన్ని ఎదిరించిన గొప్ప శూద్ర చక్రవర్తివని. అలాంటి గొప్ప వీరుని చరిత్రను ఆయన సమాధిని వెలుగులోకి తీసుకుని వచ్చిన మహాత్మా జోతిరావు పూలే 1869 లో పవాడా ఛందస్సు లో శివాజీ చరిత్ర ను కావ్యంగా రచించారని తెలిపారు. ప్రతి సంవత్సరం మహారాష్ట్ర లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఘనంగా జరుపుతారని అన్నారు.1927 సంవత్సరం నాటికి శివాజీ పుట్టి 300 సంవత్సరాలు అయిన సందర్భంగా త్రిశత జయంతి ఉత్సవాలు జరిగాయన్నారు. మహారాష్ట్ర లోని కొలబా జిల్లాలోని బద్లాపూర్ అనే చిన్న పట్టణంలో శివాజీ జయంతి వేడుకల్లో డా.అంబేడ్కర్ పాల్గొని ప్రసంగించినట్లు గుర్తు చేశారు.ఈ సందర్భంగా బాబాసాహెబ్ శివాజీ స్వతంత్ర సామ్రాజ్యాన్ని ఎలా ఏర్పాటు చేసినదీ, ఆయన ఎదుర్కొన్న ఇబ్బందులు గురించి వివరించారని తెలిపారు. .పీష్యా బ్రాహ్మణుల కులతత్వంతో శివాజీ మహారాజ్ 1680 ఏప్రిల్ 3 న హత్యగావించబడి మహారాష్ట్ర సామ్రాజ్యం బలైపోయినదని అంబేడ్కర్ చెప్పారని తెలిపారు ఛత్రపతి శివాజీ మహారాజ్ మహారాష్ట్రలో పాలకుడు అవడానికి నాడు మనుస్మృతి ఒప్పుకోలేదనీ.శివాజీ శూద్రుడైన కారణంగా అతణ్ణి అవమానించారని, .హిందూ మతంలో అసమానతలు . కులవివక్ష , అంటరానితనం, సమానత్వపు విలువలు లేవు అన్నది అందరికీ విదితమే తెలిపారు. నేడు హిందూ మతం పేరుతో కొంతమంది కుట్రలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ ,బిసీలలో ద్వేషాన్ని, అవాస్తవాలను నూరిపోస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహారాజును బ్రాహ్మణులే హత్య చేశారని తెలుసుకొన్న శంభాజీ మహారాజ్ , హత్యచేసిన హంతక బ్రాహ్మణులను ఏనుగు కాళ్ల కింద తొక్కించి ప్రతీకారం తెచ్చుకున్న విషయాన్ని. ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. అందుకే ఎస్సీ ఎస్టీ బీసీలు అంతా అసలైన చరిత్ర ను తెలుసుకోవాలన్నారు శివాజీ హిందూరాజ్య స్థాపన కోసం పోరాటం చేయలేదనీ ఆయన సమానత్వపు విలువలు కోసం పనిచేసిన వ్యక్తి అని, ఆయన మతం కోసం ప్రాకులాడలేదనీ .ఆయన జనం కోసం, జనం సంక్షేమం కోసం తపించిన శూద్ర రాజు అని .అన్ని మతాల పట్ల గౌరవంతో సహనంతో మానవతా విలువలు పాటించిన గొప్ప రాజు శివాజీ అని మరువరాదని తెలిపారు. నాటి నుండి నేటి వరకు సమసమాజ నిర్మాణం కోసం త్యాగం చేసిన మహనీయులందరినీ పూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ నాయకులు కుమ్మరి యువరాజ్, ముడిమడుగుల సురేష్, చీమల ఆనంద్ , జిమ్మిడి శాంతి కుమార్, చందనగిరి శివప్రసాద్, ఆత్రం హరీష్ ,గూడూరు లవన్ కుమార్, నాసా సునీత , తదితరులు పాల్గొన్నారు

# దరఖాస్తుల వెంట వెంటనే పరిశీలన



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో గురువారం రోజు ఆర్మూర్ తహసిల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాస్ పథకం దృశ్య కులం, ఆదాయ ధ్రువపత్రాల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని తహసీల్దార్ తెలిపారు. ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలించి గడువులోగా ఆమోదిస్తున్నామని తెలిపారు. ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన వెల్లడించారు.

# వరి కొనుగోలు కేంద్రం పరిశీలించిన వినయ్ రెడ్డి



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలం చిక్లి గ్రామంలో రైతుల యొక్క వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రం పరిశీలించి రైతులతో మాట్లాడార. వారి యొక్క సమస్యలు తెలుసుకుని వడ్ల తూకంనుపరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ సొసైటీ చైర్మన్ అశోక్, డైరెక్టర్ దయాకర్ రావు, మాజి సొసైటీ చైర్మన్ ఐలాపూర్ సుదర్శన్ ఐలాపూర్ సోసిటీ చైర్మన్ లక్ష్మీ నారాయణ గారు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# జై బాపు, జై భీం, జై సంవిధానం

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం గోవింద్ పేట్ గ్రామంలో గురువారం రోజు జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం లో భాగంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతథిగా స్టేట్ ఎస్టి కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, డిసిసి చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి. నిజామాబాద్ మాజి గ్రంథాలయ చైర్మన్ మార చంద్ర మోహన్, పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి,వినయ్ అన్న మాట్లాడుతూ, మన రాజ్యాంగాన్ని కాపాడుకుందాం మనకు అహింస, శాంతి సిద్ధాంతాలను అలవరచిన మహాత్మ గాంధీ గారిని స్మరించుకుందాం. రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేత్కర్ గారి ఆలోచనలను కాపాడుకుందాం. అందుకే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్. నినాదాలతో ఉద్యమ కార్యాచరణ ఏఐసీసీ అగ్రనాయకత్వం రూపొందించిందన్నారు. 30 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 5,97,608 గ్రామాల్లో, 7,933 పట్టణాల్లో నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతదేశ నిర్మాణానికి కోటానుకోట్ల సంఖ్యలో దృఢ నిశ్చయంతో జీవితాలను కొనసాగిస్తున్న భారతీయులను ఏకం చేయడానికి పూనుకుంది కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలోచన మేరకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఆదేశాలతో జిల్లాలో తొలిసారిగా ఆర్మూర్ నియోజకవర్గం ఆర్మూర్ పట్టణం లో జై బాపు జై భీమ్, జై సంవిధాన్, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి చిన్నా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుల్లెట్ రమేష్ మాజీ సర్పంచ్ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రామ్ రెడ్డి ,జీవన్ రెడ్డి, రూపాల గంగాధర్, మాజీ ఎంపీటీసీ మార గంగారెడ్డి గారు, ఆర్మూర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అమృత్ రావు గారు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు

# విద్యార్థుల పోరాటానికి ఫలితం దక్కింది



**చట్టంహైదరాబాద్ :** కంచ గచ్చిబౌలి భూమిలో పర్యావరణ విధ్వంసంపై స్టే విధిస్తూ.. సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 400 ఎకరాల్లో పర్యావరణం, జీవ వైవిధ్యతను కాపాడాలంటూ అన్ని వర్గాల ద్వారా జరుగుతున్న ఆందోళనలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుని.. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిందని చెప్పారు. ''హైకోర్టు రిజిస్ట్రార్ ఇచ్చిన తీర్పులోని కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుని.. వెంటనే ఈ భూముల్లో చెట్ల నరికివేతను తక్షణమే ఆపేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నెలరోజుల్లో ఓ నిపుణుల కమిటీని ఏర్పాటుచేయాలని ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఆరు నెలల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని చెప్పింది. సుప్రీంకోర్టు నిర్ణయం.. విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ప్రతిఫలం దక్కినట్లుగా భావిస్తున్నాం'' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

**కోర్టు ఆదేశాలు పట్టించుకోరా**

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత అహాన్ని పక్కన పెట్టి.. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కిషన్ రెడ్డి సూచించారు. అరెస్టు చేసిన విద్యార్థులను, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ''కంచ గచ్చిబౌలి ప్రాంతంలో అటవీ సంపదను నష్టపరిచే ప్రయత్నం జరుగుతోందని సుప్రీంకోర్టు పేర్కొంది.

# వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త..



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** కామారెడ్డి జిల్లా రాజంపేట మండలంలోని ప్రజలకు పోలీస్ శాఖ తరపున గురువారం కొన్ని సూచనలు చేయడం జరుగుతుందని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వేసవి సెలవులు రాబోతున్నాయి. తల్లిదండ్రులందరూ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసు శాఖ వారు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు పలు సూచనలు చేశారు. వేసవి సెలవుల్లో దగ్గర్లో ఉన్న చెరువులు, బావులలో ఈతకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు కూడా ఉందని అలాగే స్మార్ట్ ఫోన్స్ వినియోగంపై దృష్టి పెట్టగలరని కోరుతున్నామన్నారు

# మెగా జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి

**ఏఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి**



**చట్టం /పరకాల ;** పరకాల పట్టణ సమీపంలోని లలిత కన్వెన్షన్ హాలులో శుక్రవారం పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా 50 కంపెనీలతో చేపట్టబోయే స్కిల్స్ (టెక్నికల్ నాన్ టెక్నికల్) జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని, పరకాల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల పరిధిలోని గ్రామీణ, పరకాల పట్టణ మరియు పరిసర ప్రాంతాలకు చెందిన సంబంధించిన యువతీ, యువకులు విద్యార్హత సర్టిఫికెట్లతో అధిక సంఖ్యలో పాల్గొని ఈ మెగా జాబ్ మేళా ఒక్కరోజు మాత్రమే జరిగే అవకాశం కాబట్టి జాబ్ మేళా కు నిరుద్యోగ యువతీ యువకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని ఆలూర్ మండలం డికంపల్లి గ్రామంలో గురువారం రోజు మాక్లూర్ సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మాక్లూర్ సొసైటీ చైర్మన్ బురొల్ల అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు తగినంత తేమతో, స్వచ్ఛమైన వరి ధాన్యాన్ని తీసుకురావాలని కోరారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని హెచ్చరిస్తూ, రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్న సన్నం రకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాలకు ₹500 బోనస్ అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు శేఖర్, డైరెక్టర్లు దయాకరరావు, చిన్నయ్య, కాంగ్రెస్ నాయకులు కాలగడ్డ శ్రీకాంత్, వినోద్, విడిసి మెంబర్లు పాల్గొన్నారు.

# ప్రశంసా పత్రం అందుకున్న కమిషనర్



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో గల మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో గురువారం రోజు జరిగిన కార్యక్రమంలో సీడీఎంఏ ఐఏఎస్ శ్రీదేవి, చేతుల మీదుగా ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ప్రశంస పత్రం అందుకున్నారు. కమిషనర్ రాజు మాట్లాడుతూ, 202425 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ ప్రశంస పత్రం అందజేసారని తెలిపారు.

# కరపత్రాలు ఆవిష్కరణ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో గురువారం రోజు ఆరోగ్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడదెబ్బపై అవగాహన కరపత్రాలను ఆర్మూర్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వివేకానందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ దెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్య చైతన్య వేదిక ఆర్మూర్ డివిజన్ కన్వీనర్ జక్కుల మోహన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది నవీన్, మనోజ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY SIRIGADA PRASAD AND PRINTED AT INDUR OFFSET PRINTERS, OPPOSITE CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR, NIZAMABAD DISTRICT,TELANGANA 503001., AND PUBLISHED AT: H.NO. 3-3-486/2, GAYATHRINAGAR, VARNI ROAD, NIZAMABAD DISTRICT, TELANGANA - 503001.,EDITOR: SIRIGADA PRASAD. RNI.NO. TELTEL/2010/32350. CELL ;9948884497. PRASADSIRIGADA27@GMAIL.COM